# వాయిస్ టుడే Special

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow




కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం ఇంచార్జిగా తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఏఐసిసి ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్ కుమార్‌ను నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఓబీసీ వర్గాల సాధికారత, సామాజిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యం కోసం ఆయన చేసిన నిరంతర కృషికి గుర్తింపుగా ఈ బాధ్యత అప్పగించినట్లు ఏఐసిసి ఓబీసీ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ స్పష్టం చేశారు.



ఏఐసిసి కీలక నిర్ణయం

# ఏపి కాంగ్రెస్ ఓబీసీ ఇంచార్జిగా రుద్ర సంతోష్‌కుమార్

## ఓబీసీ సాధికారతలో కీలక పాత్ర పోషించిన నేతకు ఏఐసిసి కీలక బాధ్యత



**న్యూఢిల్లీ / హైదరాబాద్: వాయిస్ టుడే**

రాహుల్ గాంధీ దిశానిర్దేశంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం 2024లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే కార్యక్రమంలో రుద్ర సంతోష్ కుమార్ పార్టీ కోఆర్డినేటర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, పార్టీ–ప్రభుత్వం మధ్య వారధిగా నిలిచి ఈ చారిత్రాత్మక ప్రక్రియను సాఫీగా ముందుకు నడిపించడంలో ప్రధాన పాత్ర పోషించారు. గాంధీభవన్‌లో "కనెక్ట్ సెంటరు ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 వేల మంది కాంగ్రెస్ కార్యకర్తలను ఈ సర్వేలో చురుకుగా భాగస్వాముల్ని చేశారు. ప్రభుత్వ అధికారులకు, ఎన్యూమరేటర్లకు సహకారం అందిస్తూ, ప్రతిరోజూ గ్రౌండ్ లెవెల్ ఫీడ్‌బ్యాక్‌ను ప్లానింగ్ డిపార్ట్మెంట్‌కు చేరవేసి సర్వే విజయవంతానికి తోడ్పడ్డారు. 90 సంవత్సరాల తరువాత దేశంలోనే తొలిసారిగా జరిగిన ఈ విస్తృత కులగణన ప్రక్రియలో కీలక వ్యక్తిగా ఆయన పేరు ప్రత్యేకంగా నిలిచింది.

### ఎన్నికల వ్యూహకర్తగా నిరూపితమైన నాయకత్వం

2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వార్‌రూమ్ ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టిన రుద్ర సంతోష్ కుమార్, ఆధునిక డేటా ఆధారిత వ్యూహాలు, బూత్ మేనేజ్‌మెంట్, పోల్ మేనేజ్‌మెంట్, ఓటర్ లిస్ట్ విశ్లేషణ ద్వారా పార్టీ ఘన విజయానికి గణనీయంగా తోడ్పడ్డారు. 31 ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో 23 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించడంలో ఆయన సమన్వయం కీలకంగా నిలిచింది. అదే విధంగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వార్‌రూమ్ కోఆర్డినేటర్‌గా, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ ఇంచార్జిగా పనిచేసి ఎన్నికల నిర్వహణలో తనదైన ముద్ర వేశారు.

### సాఫ్ట్‌వేర్ రంగం నుంచి జాతీయ రాజకీయాల వరకు

కరీంనగర్ జిల్లాకు చెందిన రుద్ర సంతోష్ కుమార్, సాఫ్ట్‌వేర్ రంగంలో దేశ విదేశాల్లో దశాబ్దకాలం పనిచేసిన అనంతరం రాజకీయాలపై ఆసక్తితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాహుల్



గాంధీ ఆలోచనతో ఏర్పాటైన ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఘాఖాజ) ద్వారా రాజకీయ ప్రయాణం ప్రారంభించి, 2017లో తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా, 2020లో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. సుమారు 600 మందికి పైగా వృత్తి నిపుణులను కాంగ్రెస్‌తో అనుబంధం కల్పించి పార్టీ దృష్టిని ఆకర్షించారు.

2023లో ఏఐసిసి చేపట్టిన లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్‌లో భాగంగా, బూత్ స్థాయి పనితీరును పర్యవేక్షించే మొబైల్ యాప్‌ను స్వయంగా అభివృద్ధి చేసి, జాతీయ నాయకత్వం చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఇది పార్టీ వ్యవస్థాగత బలోపేతానికి కీలకంగా మారింది.

### పార్టీ విధేయతకు గుర్తింపు

కరీంనగర్ పార్లమెంట్ టికెట్ పోటీలో చివరి వరకు పోరాడినా అవకాశం దక్కకపోయినప్పటికీ, పార్టీ గెలుపు కోసం నిరాశ చెందకుండా పనిచేయడం ఆయన రాజకీయ నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. ఈ విధేయతను గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం ముందుగా ఏఐసిసి ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్‌గా అవకాశం ఇచ్చి, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఓబీసీ ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించింది.

### ఆంధ్రప్రదేశ్‌లో ఓబీసీ రాజకీయాలకు కొత్త దిశ

ఆంధ్రప్రదేశ్‌లో ఓబీసీ వర్గాల రాజకీయ సమీకరణ, సంస్థాగత బలోపేతం, కులసంఘాల సమన్వయం, క్షేత్రస్థాయి కార్యకర్తల శక్తివంతీకరణపై రుద్ర సంతోష్ కుమార్ దృష్టి సారించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణలో సాధించిన అనుభవాన్ని ఏపీలో అమలు చేస్తూ, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు ఓబీసీ వర్గాలను బలంగా ఏకం చేయడమే లక్ష్యంగా ఆయన కార్యాచరణ ఉండనుంది. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసే దిశగా సాగుతున్న రుద్ర సంతోష్ కుమార్‌కు ఈ నియామకం మరో కీలక మైలురాయిగా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

